విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో, కృష్ణాజిల్లా : రాష్ట్ర ప్రభుత్వం రైతులను, పేద ప్రజలను నట్టేట ముంచుతుందని సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య అన్నారు. సోమవారం జ్యోతి బాపూలే విజ్ఞాన కేంద్రంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుపాన్‌తో నష్టపోయిన రైతులు, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్తున్న ప్రభుత్వం ఎంత ఇస్తామో అన్న విషయం కూడా చెప్పకుండా ప్రజలను మోసం చేస్తోందని, కౌలు రైతులకు ఎకరాలు రూ.20వేలు పసుపు రైతులకు రూ.60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని పార్టీలను కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. దీని కొరకు ఈనెల 14వ తేదీన ధర్నా చౌక్‌లో జరిగే నిరాహార దీక్ష కార్యక్రమానికి సహకరించాలని కోరారు. సీపీఐ మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి లింగం ఫిలిప్ మాట్లాడుతూ టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు కూడా కలిసి వస్తే ఈ కార్యక్రమం విజయవంతం అవుతుందని, అన్ని పార్టీల ముందుకు వచ్చి కౌలు రైతులకు రావాల్సిన హక్కు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కన్వీనర్ బూర సుబ్రహ్మణ్యం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొడమంచిలి చంద్రశేఖరరావు, కౌలు రైతుల సంఘ అధ్యక్షుడు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సంఘీభావంగా ధర్నా చౌక్‌లో

14న నిరాహార దీక్ష

జయప్రదం చేయాలి : కొండయ్య

విశాలాంధ్ర బ్యూరో, కృష్ణాజిల్లా : ఈనెల 14వ తేదీన జరగనున్న నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కౌలు రైతుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొండయ్య పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వారికి సంఘీభావంగా అన్ని పార్టీలు కలసి ఈనెల 14వ తేదీన ధర్నా చౌక్ లో జరప తలపెట్టిన నిరాహార దీక్షను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కృష్ణా జిల్లా కార్యదర్శి టి తాతయ్య, నగర కార్యదర్శి లింగం ఫిలిప్ పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తితో పేదలకు న్యాయం

విశాలాంధ్ర-మచిలీపట్నం : వైయస్సార్ లా నేస్తం పథకం కింద రెండవ విడతగా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో ఆర్థిక సాయం జమచేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి న్యాయవాదులు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో బీసీలు 35 మంది ఓసి 53 మంది, ఎస్సీ 18 మంది. ఎస్టి ఇద్దరు విద్యార్థులు వైయస్సార్ లా నేస్తం పథకాన్ని పొందారన్నారు. సమాజంలో న్యాయవాద వృత్తి ద్వారా పేద ప్రజలకు న్యాయం అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా న్యాయవాదులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజితా సింగ్, మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ శీలం భారతి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు,లీగల్ సెల్ కన్వీనర్ పల్లపాటి అంకరాజు,అడ్వకేట్ బండారి వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి రాధిక, డిప్యూటీ తాహసిల్దార్ పి వీ నాంచారమ్మ పలువురు యువ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

మిచౌంగ్ తుఫాన్ వలన దెబ్బతిన్న వరి పంట నష్టం అంచనాలను తయారు చేసేందుకు అధికారులు సోమవారం సాయంత్రం నుండి చేపడతారని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, ముడా విసి రాజ్యలక్ష్మి, మచిలీపట్నం ఆర్డీఓ ఎం వాణి లతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా విని సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం స్వీకరించిన అర్జీలలో కొన్నింటి వివరాలిలా వున్నాయి. మాజీ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర కొందరు రైతులతో కలిసి కలెక్టరేట్కు వచ్చి మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను వలన జిల్లాలో చాలా చోట్ల వరి పంట నీట మునిగి రైతులు నష్టపోయారని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, వెంటనే ఎన్యూమరేషన్ చేపట్టి నష్టపరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ మిచౌంగ్ తుఫాను వలన జిల్లాలో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వెంటనే ఎన్యుమరేషన్ చేయించాలని నీట మునిగిన, పనల మీద ఉన్న వరి పంటకు నష్టపరిహారం ఇవ్వాలని, తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యానికి మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఎన్యూమరేషన్ లో సిసిఆర్సి కార్డులు లేకపోయినా కౌలు రైతుల పేర్లు నమోదు చేసి నష్టపరిహారం వారికే నేరుగా అందించాలని, ఆక్రమణకు గురైన, పూడిపోయిన మురుగు కాలువలను పూర్తిస్థాయిలో బాగు చేయించి రైతులను, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వి. జ్యోతి బసు, డీఈవో తహేరా సుల్తానా, డి ఎం హెచ్ ఓ డాక్టర్ గీతా బాయి, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయ్ కుమారి, దేవాదాయ శాఖ ఏసి కే శాంతి, ఐసిడిఎస్ పిడి సువర్ణ, సర్వ శిక్ష ఏపీసీ శ్రీరాములు నాయక్, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభ్యున్నతే లక్ష్యం

మంత్రి జోగి రమేష్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- పేదలందరిని ఆర్థికంగా సంపన్నులను చేసి ,వారి కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు .గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మండల పరిధిలోని ములపర్రు గ్రామ పంచాయతీ లోని ములపర్రు, రామన్నమోడీ గ్రామాలలో జరిగింది. మంత్రి జోగి రమేష్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించి బ్రోచర్లను అందజేశారు. స్థానికుల సమస్యలు అడిగితెలుసుకున్నారు. సీఎం జగనన్న ఎంతో దూరదృష్టితో రూపకల్పన చేసి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా గత నాలుగున్నరేళ్లుగా నవరత్నాల పథకాలు రాష్ట్రం లో అమలవుతున్నాయన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని వందలాది మంది ప్రభుత్వపథకాలు ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. జగనన్న సంక్షేమ పాలనకు నవరత్నాలు అందుకుంటున్న లబ్దిదారులే ప్రత్యక్ష సాక్ష్యమని అన్నారు .రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు జగనన్న పై అంతులేని నమ్మకం కుదిరిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెలివెల చినబాబు ,జడ్పిటిసి మలిశెట్టి వెంకట రమణ ,వైస్ ఎంపిపి ఒడిమె చిన్నరిబాబు, వైసిపి మండల పార్టి కన్వీనర్ స్ట్నునం మహెష్, ములపర్రు సర్పంచి బొడ్డు మంగమ్మ, మలిశెట్టి రాజాబాబు, మల్లేశ్వరం మర్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు పాలడుగుల బాబూరావు, ఎంపిడిఓ జె స్వర్ణభారతి, తహశీల్దార్ ఎం సత్యనారాయణ అధికారులు పాల్గొన్నారు.

'వికసిత్'లో యువత భాగస్వామ్యం కావాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : వికసిత్ భారత్‌లో యువత భాగస్వా మ్యం కావాలని పిలుపులో భాగంగా కృష్ణా విశ్వవిద్యాలయం లో 2047 ఏడాది నాటికి భారత దేశం అభివృద్ధి చెందిన జాబితాలో చేరడానికి విద్యార్థులు, యువత భాగస్వామ్యం కావాలని ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. సోమవారం వికసిత్ భారత్ పై దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువతకు దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా ప్రధాని సందేశం ఇచ్చారు. ఇందు కోసం కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జి జ్ఞాన మణి ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, యువత సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేకమైన ఐడియాస్ 4 హాష్‌టాగ్ ఏర్పాటుచేశారు. ప్రధాని సందేశం వినేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ఆసక్తి కనబరిచారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందర కృష్ణా, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, అకాడమిక్ ఆడిట్ విభాగం సమన్వయకర్త డా నవీన లావణ్య లత, ఆంగ్ల విభాగం ఆచార్యులు దీలిప్ కుమార్, సి డి సి డీన్ డా రామశేఖర్ రెడ్డి, సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తా : ఎస్పీ

విశాలాంధ్ర -మచిలీపట్నం : పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ప్రశాంతంగా విధులు నిర్వర్తించాలంటే, వారికున్న సమస్యలన్నిటిని నివృత్తి చేసుకున్నప్పుడే సాధ్యమని, జిల్లా ఎస్పీ పి.జాషువా అన్నారు. సోమవారం వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న పోలీస్ సిబ్బంది ఎస్పీకి తమ యొక్క సమస్యను అర్జీ రూపంలో సమర్పించగా, ఆ సమస్యను విని, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్న ధైర్యంగా నా దృష్టికి తీసుకురావచ్చు అని, ఆ సమస్యపై విచారణ జరిపి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, పూర్తి పారదర్శకంగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

వ్యాధులు వ్యాప్తి చెందకుండా అవగాహన

విశాలాంధ్ర-కూచిపూడి : "డిసీజ్. ప్రివెన్షన్ అండ్ ట్రీట్మెంట్"మంత్లో భాగంగా సోమవారం కూచిపూడి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో కూచిపూడి హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లో రోగులకు పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ ఎం వేద రాజ్ పలు సూచనలు అందజేశారు. ప్రజలకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, బీపీ షుగర్ వచ్చిన తర్వాత వాటిని ఎప్పటికప్పుడు కంట్రోల్ చేసుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కే రామాంజనేయులు, వి రవిబాబు, ఏఎన్ఎం డి వసుంధర, సూపర్వైజర్ బి విజయ్ కుమార్, 104 డీఈవో కే కోమలి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు. ఇదే సందర్భంగా 65 మందికి పైగా రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

మండలంలో యుడైస్ ప్లస్ సమావేశం

విశాలాంధ్ర-పెదపారుపూడి : యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ అనే కార్యక్రమం మీద మండలంలోని 33 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు భోజనం, విద్య, తదితర అంశాలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం మండల కేంద్రమైన పెదపారుపూడి ప్రాథమిక పాఠశాల లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ 1 బి శ్రీనివాస్, ఎంఈఓ 2విసురేష్ లు పాల్గొని ప్రధానోపాధ్యాయులకు మొత్తంగా వివరించారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె హరి కిషోర్, కే షర్మిల, హెచ్ఎంలు పాల్గొన్నారు.

జగన్ ఉండగా.... వ్యవసాయ దండుగ-వర్ల

విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్రం లో వైసిపి ప్రభుత్వం ఉంటే రైతులు వ్యవసాయ చేయటం వట్టి దండగని తుఫాన్ దెబ్బతో రైతు కుదేలయితే సీఎం జగన్‌రెడ్డి రైతులకు ఇంత వరకు ఎలాంటి పరిహారం ప్రకటించక పోవటంతో ఎంత దౌర్భాగ్యం గా ఉందో అర్థమవుతుందని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార రాజా విమర్శించారు. సోమవారం కపిలేశ్వరపురం లో ఆయనతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి చిరుమామిళ్ళ సూర్యనారాయణ పామర్రు, పెనమలూరు నియోజకవర్గలా పరిశీలకులు కోట వీరబాబు, జె.రామకృష్ణ మచిలీపట్నం పార్లమెంటు రైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్ రాజులపాటి శ్రీనివాస రావు జనసేన నాయకులు సనకా కిరణ్ తెదేపా నాయ కులు కె.బాబ్జి,కతిక నాగేశ్వరరావు ముత్తయ్య బోలెం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చిగురుపాటి హరికృష్ణ, తండ్రి శ్రీరామమూర్తి అను నేను ఘంటసాల మండలం, తాడేపల్లి గ్రామ నివాసిని. గృహ రుణం నిమిత్తం నా స్థలం పత్రాల **నెంబర్ 2828/2010** తాడేపల్లి నుండి విజయవాడకు బస్సులో వెళ్ళటం జరిగింది. రుణం నిమిత్తం కార్యాలయంలో స్థలం పత్రాలు ఇద్దామని బ్యాగ్‌లో చూడగా స్థలం పత్రాలు లేవు. మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. నా స్థలం పత్రాలు నాకు ఎంతో అవసరమై ఉన్నవి. కావున దయవుంచి నా స్థలం పత్రాలు దొరకిన వారు వెంటనే నా నెంబర్ 9985246200 కు ఫోన్ చేయగలరు.

చిగురుపాటి హరికృష్ణ, 9985246200

మురుగు మధ్యే అవనిగడ్డ ప్రజానికం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఊరు గొప్ప పేరు దిబ్బ అన్నట్లుగా అవనిగడ్డ పంచాయితీ పరిధిలో ప్రజలు జీవనం సాగిస్తున్నారని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం ప్రధాన కేంద్రం అయిన అవనిగడ్డ చిన్నపాటి చినుకు పడితేనే రహదార్లు చిద్రంగా తయారై ఎండాకాలం సైతం ముక్కులు మూసుకునే విధంగా చేడు వాసనతో డ్రైయినేజిలు ఉండటం భాధాకరం అన్నారు. ఇంత మురికి కూపంగా అవనిగడ్డ ఉన్నప్పటికి పాలకులు గానీ, పంచాయితీ అధికారులు కానీ చలనం లేదని, గ్రామసభల్లో సమస్యలపై ఎన్ని పర్యాయాలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, రెండవ వార్డులోని సుగాలి కాలనీలో రహదారులు అన్నీ సిసి రహదారులు అయినప్పటికి మురుగుతో సిమెంట్ రహదారులు సైతం మురుగు రహదారులుగా తయారు అయ్యాయన్నారు.

ప్రభుత్వ అలసత్వంతో రైతులకు ఇబ్బందులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : తుఫాను నష్టపోయిన పంటపొలాలను మాజీమంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర తెలుగుదేశం రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, నియోజవర్గ పరిశీలకులు లుక్కా సాయిరాం జిల్లా రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ, తెలుగుదేశం నాయకులూ బందరు మండలం కొత్తపూడి, పొట్లపాలెం, పోతేపల్లి, ఎస్.ఎన్. గొల్లపల్లి, సీతారాంపురం గ్రామాల్లో నీటమునిగిన పంటను సోమవారం పరిశీలించారు. తెలుగుదేశం ప్రత్యేక బృందం రైతులతో కలెక్టర్ కార్యాలయం చేరుకొని వరి పైరుతో గేట్ ముందు జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, జనసేన కార్యకర్తలతో కలసి నిరసన తెలిపారు, అనంతరం కలెక్టర్‌ను కలసి రైతుల సమస్యలు డిమాండ్‌లను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భాంగా మాజీమంత్రి కొల్లు రవీంద్ర మాట్లడుతూ మచిలీపట్నంలో ప్రధాన పంట అయిన వరి వేరుశనగ పంటలు మీచాంగ్ తుఫాను దాటికి దాదాపు 25 వేల ఎకరాలలో వరి, 2000 ఎకరాలలో వేరుశనగ పంటతో పాటుగా కాయ గూర పంటలు కూడా పూర్తిగా నీట మునిగిపోయాయి.దీనిపై ఇప్పటికే తెలుగుదేశం పార్టీ మండలంలోని 34 పంచాయతీలలో పర్యటించి రైతులను కలవడం జరిగింది.పంట నష్టంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఈ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ రోజు రైతాంగం ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూమీచంగ్ తుఫానుకు నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బూరగడ్డ వేద వ్యాస్ డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులకు అధికారులకు ముందు చూపు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లంకె నారాయణ ప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వర్ రావు, మండల పార్టీ అధ్యక్షులు కుంచె నాని, పట్టాన పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, నియోజవర్గ రైతు అధ్యక్షులు చిల్ల సీతారామయ్య, పట్టాన రైతు అధ్యక్షులు అల్లా మాధవ, క్లస్టర్ ఇంచార్జిలు తలారి సోమశేఖర్, లంకే శేషగిరి, సర్పంచ్ కాగిత గోపాల్ రావు, వాలిశెట్టి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలి : మండలి

విశాలాంధ్ర-చల్లపల్లి : మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలనీ, ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చల్లపల్లి మండలం మేకావారిపాలెంలో దెబ్బతిన్న వరిపంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పనల మీదున్న వరికి, నేలవాలిన వరిచేలల్లో వరికి మొలకలు వస్తుండటాన్ని రైతులు బుద్ధప్రసాద్ కు చూపించారు. ఒకటి రెండు రోజులుగానే చేలల్లో నీరు బయటకు వెళ్లిందనీ, మురుగునీటి కాలువలు పూడికతీత వెంటనే చేసి ఉంటే వర్షపునీరు ముందుగానే చేలల్లోంచి వెళ్లేదని రైతులు తెలిపారు. పంట చేతికందివచ్చే దశలో తుఫానులు తీవ్ర నష్టాలకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తడిచిన ధాన్యాన్ని రూ.1300లకు కొనుగోలు చేస్తున్నారనీ, గతంలో చంద్రబాబు కొనుగోలు చేసిన విధంగా ధాన్యాన్ని మద్దతు ధరకు కొంటేనే రైతు ఊపిరి పీల్చుకోగలుగుతారని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, రంగుమారిన, మొలకలు వచ్చిన ధాన్యాన్ని షరతులు లేకుండా మద్దతు ధరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టం అంచనాలు రూపొందించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, గుత్తికొండ వంశీకృష్ణ, వీర్ల మధు, రైతులు మేకా శ్రీనివాసరావు, మేకా సతీష్, పరుచూరి వెంకట రమణ, రాజులపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని ఆత్మహత్యా ప్రయత్నం దురదృష్టకరం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఎమ్మెల్యే ఒత్తిడితో నాడు నేడు పనులు వైసిపి నేతలే చేస్తున్నారని, పనులలో అక్రమాలు జరిగితే ప్రధానోపాధ్యాయులు బలిపశువులు అవుతున్నారని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నాడు నేడు పనులు ప్రధానోపాధ్యాయులు చేయాలని ఆదేశాలు ఇచ్చి వారిని బలవంతం పెట్టి వైసిపి నాయకులు పనులు దక్కించుకుంటున్నారని, మోపిదేవి మండలం కె కొత్తపాలెం గ్రామంలో నాడు నేడు పనులలో అక్కడ వైసిపి నాయకులు చేసిన అక్రమాలు బయటపెడితే వారిపై చర్యలు చేపట్టకపోగా ఆకరి క్షణంలో ప్రధానోపాధ్యాయులని బలిపశువులను చేయాలని చూస్తున్నారని మండలి అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులనే కాక, ఉద్యోగస్తులందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండలి పేర్కొన్నారు.

నష్టపరిహారం సర్వే

విశాలాంధ్ర-కూచిపూడి : మిచౌంగ్ తుఫాను వల్ల మొవ్వ మండలంలో నష్టపోయిన పంటను క్షేత్రస్థాయిలో సర్వే చేసి ఏ విధమైన అవకతవకలు లేకుండా నమోదు చేయాలని మండల తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, వ్యవసాయ అధికారి కంచర్ల శివప్రసాద్ ఆదేశించారు. మండలంలోని వీఆర్వోలకు, వి ఏ ఏ లకు సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో మండలంలోని పొలాలను సందర్శించి ముంపుపాలై కోత కోయని పొలాలను సర్వే చేసి నమోదు చేయాలని ఆదేశించారు. కోత కోయని పొలాలలో 33 శాతం నష్టం పైగా నష్టపోయిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి 33 అంశాల ప్రొఫార్మాలో పూర్తి చేయాలని సూచించారు. వర్షాలకు తడిసిన పనల మీద ఉన్న వరిపైరునుకూడా ప్రత్యేక లిస్టు తయారు చేయాలని ఆదేశించారు. పనల మీద ఉన్న పైరు నష్టపరిహారం పై స్పష్టత రావాలని ,అయితే రంగు మారిన ధాన్యం అంచనాల నిమిత్తం వివరాలు సేకరించాలని సూచించారు. 33 శాతం పైగా కోయకుండా దెబ్బతిన్న వారిపై ఎకరానికి రూ.6,800లు, హెక్టారుకురూ.17 వేలు నష్టపరిహారం ప్రకటించిన సంగతిని వివరించారు. ఈ దశలో అటు అధికార , ఇటుప్రతిపక్ష, వామపక్ష పార్టీల నుంచి ఏ విధమైన ఫిర్యాదులుకుతావివ్వకుండా నమోదు విధులు నిర్వహించాలని హెచ్చరించారు.

ప్రజావ్యతిరేక భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

విశాలాంధ్ర-బంటుమిల్లి :- న్యాయ నిపుణులు ,ప్రజాభిప్రాయాలు తీసుకోకుండా ప్రజావ్యతిరేక భూ హక్కు యాజమాన్య చట్టాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ఆ జీవో ని తక్షణమే రద్దు చేయాలంటూ బంటుమిల్లి జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించి ర్యాలీతో బయలుదేరి తహశీల్దారు కార్యలయంలో వినతి పత్రాన్ని అందజేశారు .బంటుమిల్లి న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు) అధ్వర్యంలో జరిగిన ర్యాలీ కోర్టు ప్రాంగణం నుండి అంబేడ్కర్ ,మహాత్మా గాంధీ సెంటర్ల మీదుగా స్థానిక తహశీల్ధార్ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలోని అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పల్లెం వీర వెంకటేశ్వరరావు, కూనపురెడ్డి వీర రాంబాబు, నాగాంజనేయులు, స్తునం అశోక్ కుమార్, తమ్మన నాగ సురేష్, సుధాబత్తుల సురేష్, పులి పవన్ కుమార్, చక్రవర్తి, అంగర రంగనాద్, మోజెస్, సూర్య, టిడిపి నాయకులు ఎం డి నజీర్, సీపీఎం నాయకులు లంకదాసుల అజయ్‌గోష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

విశాలాంధ్ర- చల్లపల్లి : చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. కోళ్లఫారాల సమీపంలో హైవేపై కారు.. ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ఘంటసాల మండలం దేవరకోట గ్రామస్థుడు దాసి శ్రీనివాసరావు తీవ్ర గాయాలపాలయ్యాడు. తలకు త్రీవగాయం కావటంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది నల్లమ్మ, షఫీలు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి మచిలీపట్నం తరలించారు.

15 నుంచి ఆడుదాం ఆంధ్ర : ఎంపీడీఓ

విశాలాంధ్ర-గన్నవరం : ఈ నెల 15 వ తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు సంభందించి గన్నవరం మండలం లో అన్ని గ్రామాలలో పంపిణి కి స్పోర్ట్స్ కిట్లు మండల కార్యాలయం కు గురువారం చేరుకున్నాయి. మండల పరిషత్ అధికారి సత్యకుమార్, గన్నవరం నియోజకవర్గ క్రీడా సమన్వయ కర్త ధనియాల నాగరాజు, రాజేష్, బాజీ పరిశీలించారు. త్వరలో అన్ని గ్రామాలకు స్పోర్ట్స్ కిట్ లు పంపిణీ చేస్తామని సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ పి ఆర్ డివెంకటేశ్వరమ్మ,రాజేష్,బాజి, డిజిటల్ అసిస్టెంట్ నాగ జ్యోతి,మహిళ పోలీస్ జాగృతి పాల్గొన్నారు.

దప్పు కళాకారుడు శ్రీనివాసుడుకు ప్రతిభా పురస్కారం

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రముఖ దప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడుకు ప్రతిభా పురస్కారం లభించింది. కళాదర్బార్.. ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు, మహాదాతలు శ్రీ ఆళ్ల దశరథరామిరెడ్డిల స్మారక ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభ గుంటూరులో జరిగింది. శ్రీనివాసుడుకు పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు పొత్తూరి రంగారావు తదితరులున్నారు.

రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : ఐక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చల్లపల్లిలో నిరాశ్రయులకు చలి నుంచీ రక్షణ అందించేలా రగ్గుల పంపిణీ జరిగింది. శివాలయం సెంటర్, బస్టాండ్, సబ్ట్రేషన్ పక్కన, కోమలానగర్ వాడల్లో రోడ్డుపక్కన జీవిస్తున్న 50 మందికి రాత్రివేళ రగ్గులు కప్పారు. ఫౌండేషన్ ప్రతినిధి కస్తూరి విజయకుమార్, చల్లపల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పేరం మదుసూధనరెడ్డి, నడకుదురు లీలాబ్రహ్మేంద్ర, ఎండి.ఎకె.జిలానీ, పెనుమూడి శ్రీనివాసరావులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ నిర్వాహకులు కిరణ్, ఆకూరి శ్వేత మరికొందరు సభ్యులు మూడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనీ, ఐక్యం సంస్థ ఆధ్వర్యంలో 522వ సేవా కార్యక్రమంగా రోడ్డుమీద పడుకునే అనాథలకు రగ్గులు ఇచ్చినట్లు తెలిపారు.

చల్లపల్లిలో దొంగల హల్‌చల్

మూడు షాపుల్లో చోరీ, మరో మూడు షాపుల్లో చోరీకి యత్నం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లిలో ఆదివారం అర్ధరాత్రి దొంగలు హల్చల్ చేశారు. మూడు దుకాణాల్లో చోరీకి పాల్పడగా, మరో మూడు దుకాణాల్లో చోరీకి యత్నించారు. బస్టాండ్ సెంటరులోని వైష్ణవి మెడికల్స్, ఆర్యవైశ్య బజారులో విజయ చాముండేశ్వరీ ఎలక్ట్రికల్స్, శ్రీదేవి మెడికల్స్లో నగదు అపహరించినట్లు దుకాణదారులు చెబుతున్నారు. కొల్లిపర ఆంజనేయులు ఫర్టిలైజర్స్, గ్రామోర్ దుకాణాల షట్టరు తాళాలు పగలకొట్టి షట్టర్లు తెరవకుండానే వెళ్లిపోయారు. ఆర్ఆర్ మొబైల్స్ సీసీ టీవీ కెమేరా వైర్లు కట్చేసి, అమ్మ మొబైల్స్ తాళాలు పగలకొట్టి షట్టర్ తెరవలేదు. ఇనుప రాడ్తో తాళాలు పగలకొట్టిన దృశ్యాలు సీసీ కెమేరాల్లో రికార్డయ్యాయి. ద్విచక్ర వాహనంపై వచ్చిన దొంగలు బస్టాండ్ ఎదుట ప్రధాన రహదారిపై రెండు..మూడు సార్లు తిరిగినట్లు కెమేరాల్లో కనిపిస్తోంది. బైకుపై వచ్చిన ఇద్దరిలో ఒకరు బైకు దిగి సీసీ టీవీ కెమేరా వైర్లు కట్ చేసేంతవరకు రికార్డయింది. చోరీ సమాచారం అందుకున్న చల్లపల్లి ఎస్ఐ సిహెచ్.చిన్నబాబు వెంటనే సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. వైష్ణవి మెడికల్స్లో రూ.60వేల నగదు చోరీ జరిగిందనీ, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

సీపీఐ సీనియర్ నేత పెదర్లవిష్ణు మృతి

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ పెదర్ల విష్ణు (78) సోమవారం మధ్యాహ్నం 2:45 నిమిషములకు గుంటుపల్లిలోని తన నివాసంలో కన్నుమూశారు. కామ్రేడ్ విష్ణు మరణవార్త తెలియగానే సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, సీపీఐ మండల నాయకులు చెరుకూరి సుబ్బారావు, జీవి రత్నం, కిలారు దత్తు బాబు, కంచర్ల ప్రసాద్, బి వెంకటేశ్వరరావు, చెరుకూరు సాంబశివరావు, గోగినేని సాంబశివరావు తదితరులు విష్ణు మృతదేహాన్ని సందర్శించి సీపీఐ జెండాను కప్పి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మృతికి సీపీఐ తరఫున సంతాపాన్ని తెలిపి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకటనారాయణ ప్రసాద్ (అన్నా) మైలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కోమటి సుధాకర్ జాస్తి గోపాలకృష్ణ, జాస్తి రామకృష్ణ, గోగినేని అనిల్, కోనేరు పెద్దబాబు, పెదర్ల రవి, వైఎస్ఆర్సిపి నాయకులు నర్రా వెంకటకృష్ణయ్య గ్రామ ప్రముఖులు చెరుకూరి చిన్న వెంకయ్య చెరుకు అప్పారావు లతోపాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. యుక్త వయసు నుండి సీపీఐ ఎడల ఆకర్షితులై గుంటుపల్లి గ్రామంలో సీపీఐ ప్రజా ఉద్యమాల అభివృద్ధితోపాటు మైలవరం నియోజకవర్గంలో కమ్యూనిస్టు ఉద్యమాలలో చురుకైన నాయకునిగా పాల్గొన్న కామ్రేడ్ పెదర్ల విష్ణు మృతి వలన నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయామని సిహెచ్ కోటేశ్వరరావు బుడ్డి రమేష్‌లు అన్నారు. రైతు వర్గం నుండి యువకులను కమ్యూనిస్టు పార్టీ ప్రజా సంఘాల పై ఆకర్షించే విధంగా కృషిచేసి నిబద్ధతతో బలోపేతం కావడానికి శ్రమించి మంచి నాయకుడు కమ్యూనిస్టు కామ్రేడ్ పెదర్ల విష్ణు అని అన్నారు.

పొంగులేటికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : తెలంగాణమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరావు విజయవాడ వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ ఘనంగా స్వాగతం పలికి అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహారావు, దనేకుల మురళీమోహన్రావు కృష్ణ పోతురాజు ఏసుదాసు నాగూర్ గొంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

-సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ : డిసెంబర్ 26వ తేదీన సీపీఐ 99వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నగరంలో ఘనంగా నిర్వహించాలని, అందుకు నగరంలోని అన్ని డివిజన్‌లలో పార్టీ జెండా ఆవిష్కరణలు, సభలో నిర్వహించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ మహోత్తరమైన పాత్ర వహించిందని చెప్పారు. సీపీఐ 18వ డివిజన్ శాఖ కమిటీ సమావేశం ప్రభావతి అధ్యక్షతన సిద్ధం కృష్ణారెడ్డి భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో గడిచిన 99 సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ అనేక విముక్తి ఉద్యమాలకు నాయకత్వం వహించిందన్నారు. దేశ స్వాతంత్ర్యానికై సాగిన స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిందని, లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన చరిత్ర సీపీఐకి ఉందని పేర్కొన్నారు. పార్టీ నగర కార్యవర్గ సభ్యులు సంగుల పేరయ్య మాట్లాడుతూ కృష్ణలంక చలసాని నగర్ ప్రాంతం నిర్వహించాలని, కార్యక్రమంలో పార్టీ సభ్యులు అందరూ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొనాలని అన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి అంబడిపూడి మోహన్ కుమార్, సహాయ కార్యదర్శులు కూరాకుల స్టాలిన్, గుంజా క్రాంతికుమార్ డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ లా నేస్తం 2వ విడతలో రూ.45లక్షలు

జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వైఎస్ఆర్ లా నేస్తం 2వ విడతలో రూ.ల45లక్షలు లబ్ధి చేకూరినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్ తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం వైఎస్ఆర్ లా నేస్తం పథకం ద్వారా విడుదల చేసిన కార్యక్రమానికి స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ ఇతర అధికారులు, న్యాయవాదులు హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేందుకు మూడేళ్ళ పాటు ఏ0డాదికి రూ.60వేలు చొప్పున అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకుని వృత్తిలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రతినిధులు నాగార్జునరావు, విఠల్‌రావు, న్యాయవాదులు, పలు కార్పొరేషన్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

కోళ్లఫారం ఏర్పాటుకు గ్రామస్తుల నిరసన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: నూతనంగా ఏర్పాటు చేస్తున్న కోళ్లఫారం ఏర్పాటును నిరసిస్తూ విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి శివారు నర్మదానగర్ గ్రామస్తులు సోమవారం మండలకేంద్రంలో ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే...గ్రామానికి సుమారు కిలోమీటరు దూరంలో తెలంగాణా ప్రాంతానికి చెందిన కొందరు కార్పొరేట్ స్థాయి కోళ్లఫారం ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. దీనివల్ల తమ గ్రామంలో పర్యావరణ దెబ్బతినటంతోపాటు గ్రామస్తులు, పశువులు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతాయని దీన్ని నిలిపివేయాలంటూ కొద్దికాలం క్రితం గ్రామస్తులు ఆందోళన చేశారు. గ్రామంలో రిలే నిరాహార దీక్షలు చేయటంతోపాటు, పలుమార్లు అధికారులకు అర్జీలు అందజేశారు. నిర్మాణపనులు మాత్రం నిరాటంకంగా కొనసాగుతుండటంతో గ్రామస్తులు తమ గ్రామం నుంచి పెద్దఎత్తున బయలుదేరి జాతీయ పతాకాలతో మండలకేంద్రానికి చేరుకున్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుంచి రెవిన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దసంఖ్యలో గ్రామస్తులు మండలకేంద్రానికి చేరుకుంటున్నారన్న సమాచారంతో పోలీసుశాఖ భారీఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసింది. రెవిన్యూ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేసి, అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు చంద్రశేఖర్‌కు, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణకు అందజేశారు. ఈ సందర్భంగా ఆందోళనకు నాయకత్వం వహించిన వి.నాగరాజు మాట్లాడుతూ, గ్రామంలో కోళ్లఫారం నిర్మాణాన్ని అడ్డుకుంటూ పలుమార్లు అధికారులకు అర్జీలు అందజేసి, ఆందోళనలు చేపట్టినా వారి కార్యకలాపాలు ఆగలేదన్నారు. కేవలం ఎస్సీ, ఎస్టీలు నివసించే గ్రామాన్ని కార్పొరేట్ యజమానులు ఎంచుకుని, ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేయటం దారుణమన్నారు. దీని ఏర్పాటుతో మనుషుల, పశువుల ఆరోగ్య పరిస్థితులు దెబ్బతినటంతోపాటు, వ్యవసాయ భూములు పంటలకు పనికిరాని విధంగా తయారవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు అధికారులు ఇచ్చిన అనుమతులు రద్దు చేయకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కారుల అర్జీ పత్రాన్ని ఉన్నతాధికారులకు పంపి, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని అధికారులు హామీ ఇవ్వటంతో ఆందోళన ముగిసింది. తిరువూరు సీఐ షేక్ అబ్దుల్ రఫీ, తిరువూరు, విస్సన్నపేట ఎస్ఐలు సతీష్, జివివి.సత్యనారాయణలు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

కళ్లజోళ్లు పంపిణీ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించినన ఉచిత కంటి వైద్య శిబిరంలో అర్హులైన 206 మందికి కళ్ళజోడులను సోమవారం రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నాడు లేని విధంగా రెడ్డిగూడెం పీఏసీఎస్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమ న్నారు. ఈ సందర్భంగా సొసైటిఅధ్యక్షులు శ్రీనివాసరెడ్డిని విజయభాస్కరరెడ్డి ప్రత్యేక అభినందించారు. పీఏసీఎస్ అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రెడ్డిగూడెం పీఏసీఎస్ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన రుణాలను అందించడంతోపాటు, ధాన్యం కొనుగోలు ద్వారా వర్షానికి తడిచిన ధాన్యంలో తేమశాతం ఎక్కువుగా ఉన్నప్పటికి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే రెడ్డిగూడెం సొసైటి ద్వారా మన సేవా కార్యక్రమాల నిర్వహించాలనే లక్ష్యంతో సుమారు 400 మందికి ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి అవసరమైన 206 మందికి కళ్ళజోడులను ఉచితంగా అందించినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో రెడ్డిగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రసిద్ధ మృదంగ, ఘట విద్వాంసుడు విజయకుమార్ మృతి

విజయకుమార్(ఫైల్)

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రసిద్ధ మృదంగం, ఘటం విద్వాంసుడు మురమళ్ళ విజయకుమార్(64) సోమవారం మధ్యాహ్నం మృతి చెందారు. గుడివాడ ఆయన కుమార్తె గృహం లో అస్వస్థతకు గురికాగా హాస్పటల్ చేరే సమయానికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో మృదంగ అధ్యాపకునిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన ఆయన రాజమండ్రి ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలలో దాదాపు మూడున్నర దశాబ్దాలుగా సహవాద్య కళాకారునిగా, సహాధ్యాపకునిగా, అధ్యాపకునిగా బాధ్యతలు నిర్వర్తించి అందరి అభిమానాన్ని, మన్ననలను పొందారు. సంగీత రంగానికి, నాట్య రంగానికి ఆయన అందించిన సేవలు నిరూపమానం. మంగళవారం ఉదయం అంతిమ సంస్కారం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండల ప్రజాపరిషత్ కార్యాలయం లో సోమవారం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఎంపీపీ మర్కాపూడి గాంధీ ఆడుదాం అంధ్ర ఆటల పోటీలకి సబందించిన బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రభుత్వ అధికారులు మెడికల్ ఆఫీసర్ ఇందిరా, మండల ఏ ఇ సుందర రామయ్య, ఆర్‌డబ్ల్యూ ఎస్.ఏ ఇ నరసిహారావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి , శ్రీ లక్ష్మి తిరుపతమ్మ దేవస్థానం డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు ,ఏ ఓ కె .సిద్దారెడ్డి ,ఆఫీస్ సిబ్బంది,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో పీఏసీఎస్ గోడౌన్ : తాతినేని

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచిచర్ల మండలంలోని పరిటాల గ్రామంలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ యొక్క గోడౌన్ ను కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి తో కలిసి శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కృతనిశ్చయంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. రైతులకు సేవలందించే సహకార సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనం విక్రయం నుంచి పంటల కొనుగోలు వరకు ఆర్.బి.కే. ల ద్వారా రైతులను ఆదుకుంటున్న సీఎం జగన్ ను రైతులు, ప్రజలు ఆశీర్వదిస్తున్నారని అన్నారు. రైతుల ఆర్థిక స్వాలంబన కోసం సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుత సర్కారు రైతుల అభ్యున్నతికి తోడ్పాటు నందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి ని శాలువా తో సత్కరించారు.ఈ కార్యక్రమం లో చింతా రవీంద్రనాథ్, సర్పంచ్ అమరలపూడి ఆనంద జ్యోత్స్న, మార్తా శ్రీనివాసరావు, నన్నపనేని నరసింహారావు, పాటి బండ్ల హరి జగన్నాథరావు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : క్రీడల్లో రాష్ట్రాన్ని ముందుంచేందుకు ప్రభుత్వ చేస్తోన్న కృషిలో భాగంగా విజయవాడ వేదికగా నేటి నుంచి క్రీడా సంబరాలు ప్రారంభం కానున్నట్లు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పీబీ సిద్దార్థ జూనియర్ కళాశాలలో ఆయన టోర్నమెంట్ కన్వీనర్ శివసత్యనారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత్‌తో కలిసి సోమవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో పోటీల షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పటమటలోని సీఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో అండర్-19 బ్యాడ్మింటన్ జాతీయ పోటీసుల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 25 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 33 టీమ్స్ పోటీల్లో పాల్గొంటున్నాయని, 164 మంది బాలుగు, 161 మంది బాలికలు పాల్గొంటున్నారని తెలిపారు. క్రీడాకారులతో పాటు 100 మంది టెక్నికల్ సిబ్బందికి అంవసరమైన భోజన, వసతి, రవాణా తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలకు అబ్జర్‌వైజర్‌గా యూపీకీ చెందిన రాజు రాణా హాజరవుతున్నారని, 4 రాష్ట్రాలకు ఒక ప్రత్యేక కో-ఆర్డినేషనల్ అధికారిని నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, సిద్దార్థ అకాడమి, సీఎంసీ ఇండోర్ స్టేడియం సౌజన్యంతో నిర్వహించే ఈ పోటీలు విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కన్వీనర్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 67వ ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలను 12న సాయంత్రం 4 గంటలకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు మంత్రులు, ప్రజా ప్రతినిదులు, ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. విలేఖర్ల సమావేశంలో సిద్దార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, విజయవాడ
O.S.No.1079/2020
బిట్వీన్ :
కెనరా బ్యాంక్, మధునగర్ బ్రాంచి, మొగల్రాజపురం, విజయవాడ. - వాది
మరియు
మజ్జి నరేష్ - ప్రతివాది
టు
ప్రతివాది: మజ్జి నరేష్, తండ్రి రామ మోహనరావు, డోర్ నెం. 23-31-15, కొమ్ముమారి వీధి, సత్యన్నారాయణపురం, విజయవాడ-520 011, ఎన్.టి.ఆర్.జిల్లా.
నా క్లయింటు పైనెంబరు దావాలో ప్రతివాదికి న్యాయస్థానం ద్వారా నోటీసులు పంపిననూ, వారు సదరు నోటీసులు అందుకో కుండా బుద్ధి పూర్వకంగా న్యాయ స్థానమునకు హాజరు కావటం లేదు. ప్రతివాది హాజరు నిమిత్తం ది.14.12.2023వ తేదీన పై దావా వాయిదా అయివున్నది. కావున ప్రతివాది ది.14.12.2023న ఉదయం 10.30 గంటలకు పైన న్యాయస్థానము నందు ప్రత్యక్షముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టునందు హాజరై తమ అక్షేపణలను తెలుపుకోవలెను. లేనియెడల దావా పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా తేది. 14.12.2023.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
యం. జ్ఞానాంబ, అడ్వకేట్,
ప్లాట్ నెం.406. జి.జె.యం.ఆర్. రెసిడెన్సీ, జి.వి.ఆర్.నగర్, విజయవాడ-520 003
సెల్ నెం. 9440183394.
విజయవాడ, తేది: 11.12.2023.

పొలాలను పరిశీలించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర-గంపలగూడెం : తుఫానుతో తడిసిన వరి, మిరప, పత్తి పంటను తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు నెట్టెం .రఘురాం, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి సోమవారం నాడు మండలంలోని పెనుగొలను లో పరిశీలించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు నెట్టెం. రఘురాం ,విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు ఎస్.కె. నాగుల్ మీరా లు మాట్లాడుతూ తుఫాను వలన జిల్లాలో వ రి, మిరప, పత్తి తదితర పంటలకు తీరని పంట నష్టం వాటిలిందని తెలిపారు. రైతులు తడిసిన పంట పొలాలను ఏమి చేయాలో తెలియక పొలాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. తక్షణమే వరి పైరుకు 30 వేల రూపాయలు, మిరప పంటకు ఎకరాకు 50వేల రూపాయలు వెంటనే ప్రభుత్వం పరిహారం అందించా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ పరిశీలకులు చి ట్టబత్తుని. శ్రీనివాసరావు (చిట్టిబాబు), తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ సేవల. దేవత దత్తు, మాజీ ఎస్ఎస్పి ఎడమకాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వై .పుల్లయ్య చౌదరి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రేగళ్ల .వీరారెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు డివి. కృష్ణారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ డి. సీతారాం ప్రసాద్, మండల పార్టీ కార్యదర్శి ఎనగంటి. మధుసూదన్ రావు ,మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మెట్ట గుట్ట శ్రీ శేషాచల శ్రీనివాస స్వామివారిని తెలుగుదేశం పార్టీ నాయకులు దర్శించుకున్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : వీఆర్ఏలకు ఏ స్కేల్ జీతాలు, డిఏ బకాయిల చెల్లింపు, బిఎల్ఓ డ్యూటీల నుండి వీఆర్ఏలను మినహాయించాలని ఇంకా ఇతర సమస్యలు పరిష్కార కోసం దశలవారీ పోరాటం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి టి.అంజి,కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రాకముందు వీఆర్ఏలకు అనేక హామీలు ఇచ్చారని, డిఏ,టిఏలు, అమలు చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని చెప్పారని అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలుగా అయినా అమలు చేయలేదన్నారు. అమలవుతున్న డిఏలలో ప్రతి ఒక్కర నుండి రూ.24000 వేలు రికవరీ చేశారని, రాష్ట్రవ్యాప్తంగా 14 కోట్లు రికవరీ చేసారని, తిరిగి ఇస్తామంటున్నారని, తెలంగాణలో వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేస్తున్నారని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తిస్తామన్నారన్నారు. లేకుంటే భవిష్యత్తు కార్యచరణలో భాగంగా ఈనెల 21న ఎం.ఆర్.ఓలకు వినత పత్రాలు ఇస్తామన్నారు. 28న రాష్ట్రంలోని అన్ని కలెక్టెట్లు వద్ద దీక్షలు చేస్తామని,జనవరి 5న సి.సి.ఎల్.ఎ ఆఫీస్ మంగళగిరి వద్ద రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాదిమందితో మహాధర్నా చేస్తామన్నారు.అప్పటికి స్పందించకపోతే నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగిసాహెబ్, జాయింట్ సెక్రెటరీ షేక్.మోగాలాభి పాల్గొన్నారు.

17న తిరుపతమ్మ ఆలయ చైర్మన్‌గా శ్రీనివాస్ ప్రమాణం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సహకారంతో పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ వారి ఆలయ చైర్మన్ గా ఈ నెల 17-12-2023 ఆదివారం ఉదయం 10గంలకు ఆలయ అవరణం నందు ప్రమాణ స్వీకారం చేయబోతున్నాను అన్ని బీసీ నేత జంగాల. శ్రీనివాసరరావు. (వాసు) సోమవారం పత్రికా విలేకరుల కు తెలిపారు. కావున జగ్గయ్యపేట నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సానుభూతిపరులు పట్టణ/గ్రామాల నుండి ప్రతి ఒక్కరూ రావాల్సిందిగా మనసారా కోరుకుంటున్నాను. చరిత్రను తిరగరాసి బిసి (యాదవ్)సామాజిక వర్గానికి చెందిన నాకు ఈ పదవిని అప్పగించిన మన ప్రియతమ నాయకులు సామినేని ఉదయభాను కి సదా రుణపడి ఉంటానని, అలాగే దేవస్థాన చైర్మన్ పదవికి మరింత వన్నె తీసుకువస్తానని తెలియజేసుకుంటున్నాను.బిఈ కార్యక్రమంలో మీడియా మిత్రులకు కూడా ప్రత్యేక ఆహ్వానం వుంది అన్ని తెలిపారు.

దళితులమనే ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణం విస్మరించారు

విశాలాంధ్ర-వీరులపాడు: దళితులమనే చులకనతోనే కంచికచర్ల నుండి పెద్దాపురం ఆర్ అండ్ బి రహదారి మిగిలివున్న 500 మీటర్లు రహదారిని నిర్మించటానికి అలసత్వం చూపిస్తూన్నారని మండల బిఎస్పి పార్టీ ఆరోపించింది. బిఎస్పి పార్టీ నాయకులతో ఆర్ అండ్ బి రహదారి పై ధర్నా నిర్వహించారు. పెద్దాపురం గ్రామంలో 18 కోట్ల నిధులతో అట్టహాసంగా కంచికచర్ల నుండి పెద్దాపురం వరకు నిర్మించిన ఆర్ అండ్ బి రహదారి పెద్దాపురం గ్రామంలో వ్యవసాయశాఖ చెక్పోస్ట్ వద్ద నుండి రాష్ట్ర సరిహద్దు వరకు వేయకపోవటంతో బిఎస్పి పార్టీ నాయకులతో కలిసి స్థానికులు సోమవారం రహదారిపై ధర్నా నిర్వహించారు.అధికారులకు,నాయకులకు తమ సమస్యను ఎన్నిసార్లు విన్నవించుకున్నను రహదారి నిర్మాణం పూర్తికావటం లేదని స్థానికులు ఆరోపించారు.దళితులమనే చిన్న చూపుతోనే ఈ రహదారి నిర్మించటం లేదని, అగ్ర వర్ణాల ఏరియా లో సీసీ రోడ్లు, డ్రైనేజీ లు నిర్మించుకున్నారని, దళితులు నివాసం ఉండే ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేసారు.ఈ కార్యక్రమంలో బిఎస్పీ నియోజకవర్గ నాయకుడు బర్రె ఉదయ్ కిరణ్, స్థానిక బిఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 132 of 2022
Between:
SAMBASIVA CHIT FUNDS PVT.LTD. Governorpet, Vijayawada, rep. by It's Foreman & Managing Director B Sambasiva Reddy son of B.V. Subba Reddy - DISPUTANT
AND
Jyothi Medical Agencies Rep. by its P Anil Kumar and others - Opponents
TO,
1.Jyothi Medical Agencies, Rep. by its P. Anil Kumar, Son of Srinivasa Rao Situated at D.No. 73-7-4, Donka Road, Opp. To VSM High School, Patamata, Vijayawada-10. (Opponent No.1)
2. Pedapudi Srinvasa Rao, Son of Parameswara Rao, Resident of D.No.70-2-16, Siva Shankar Nagar, Patamata, Vijayawada.-10. (Opponent No.2)
3. Pedapudi Ravi, Son of Parameswara Rao Resident of D.No. 70-2-38, Thota Vari Veedhi, Patamata Vijayawada. -10. (Opponent No. 3)
4. Chunchula Mohana Krishna, Son of Rambabu, D.No. 24-26, SF-1, Block No.1, Keerthi Towers, Yanamalakuduru, Vijayawada-7 (Opponent No. 4)
- (Opponents No.1 to 4)
Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to 22-12-2023 for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on 22-12-2023 at 10-30 A.M. in person, failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)
A. PRASOON KUMAR, Advocate, D.No.25-104 F2, Sri Chakra Apartment, Yanamalakuduru, Vijayawada-7
Date of Adjournment: 22-12-2023

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 129 of 2021
Between:
SAMBASIVA CHIT FUNDS PVT.LTD. Governorpet, Vijayawada, rep. by It's Foreman & Managing Director B Sambasiva Reddy son of B.V. Subba Reddy - DISPUTANT
AND
Pedapudi Srinivasa Rao and others - OPPONENTS
To,
1. Pedapudi Srinvasa Rao, Son of Parameswara Rao, Residentof D.No. 70-2-16, Siva Shankar Nagar, Patamata Vijayawada.-10. (Opponent No.1)
2. Pedapudi Ravi, Son of Parameswara Rao Residentof D.No. 70-2-38, Thota Vari Veedhi, Patamata Vijayawada. -10 (Opponent No. 2)
3. Chunchula Mohana Krishna, Son of Rambabu D.No. 24-26, SF-1, Block No.1, Keerthi Towers, Yanamalakuduru, Vijayawada-7. (Opponent No.3)
4. Pedapudi Anil Kumar Son of Srinivasa Rao, Residentof D.No. 70-2-16, Siva Shankar Nagar, Patamata Vijayawada.-10. (Opponent No.4)
- (Opponents No.1 to 4)
Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to 22-12-2023 for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on 22-12-2023 at 10-30 A.M. in person, failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)
A. PRASOON KUMAR, Advocate, D.No.25-104 F2, Sri Chakra Apartment, Yanamalakuduru, Vijayawada-7
Date of Adjournment: 22-12-2023

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT VIJAYAWADA
ACP No. 26 of 2021
Between:
SAMBASIVA CHIT FUNDS PVT.LTD. Governorpet, Vijayawada, rep. by It's Foreman & Managing Director B Sambasiva Reddy son of B.V. Subba Reddy - DISPUTANT
AND
Kummetha Srinivasa Reddy and others - OPPONENTS
To,
1. Kummetha Srinivasa Reddy, Son of Late Nagi Reddy, Resident of Uppalapadu Village, Addanki Mandal, Prakasam District. (Opponent No.1)
2. Bapathu Anuradha Wife of Bapathu Venkateswara Reddy, Resident of D.No. Flot No. 401, 4th Floor, Brundavan Apartment Saibaba Tempe Road, Koritipadu Guntur District. (Opponent No. 3)
(Opponents No.1 and 3)
Please take notice that the above Claim Petition had filed for recovery of Chit amount and the Hon'ble Authority ordered notice to you and posted the case to 22-12-2023 for your appearance. So you are here by requested to appear before Deputy Registrar of Chits at the office of District Registrar, D.No. 56-6-7A, Opposite to Priya Children Hospital, Pantakaluva Road, Maruthi Colony, Patamata, Vijayawada-520010 to answer the claim on 22-12-2023 at 10-30 A.M. in person, failing which the matter will be decided in your absence.
(By order of the Hon'ble Deputy Registrar of Chits, Vijayawada)
A. PRASOON KUMAR, Advocate, D.No.25-104 F2, Sri Chakra Apartment, Yanamalakuduru, Vijayawada-7
Date of Adjournment: 22-12-2023

పౌర హక్కులపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ : భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని ఆంధ్ర ప్రదేశ్ ప్లానింగ్ కమీషన్ వైస్ చైర్మన్ మల్లాది విష్ణు అన్నారు. స్థానిక ఒక హెూటల్‌లో "జాతీయ మానవ హక్కులు నేర నిరోధక కౌన్సిల్" రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జరిగిన 'జాతీయ మానవ హక్కుల' దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణలో ప్రతి పౌరుని బాధ్యతలు గుర్తుచేసి, వారిని అందుకు సమాయత్తం చేసే వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం "జాతీయ మానవ హక్కులు నేర నిరోధక కౌన్సిల్" చేస్తోన్న కృషిని ఆయన కొనియాడారు. ప్రాథమిక విద్యా స్థాయి నుంచి పౌర హక్కుల గురించిన అంశాలు పాఠ్యాంశాలుగా బోధించాల్సిన అవసరం ఉందని సీఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస రావు అన్నారు. బాలలకు విద్యా హక్కు చట్టంలో భాగంగా బోధనా పద్ధతులపై బాలలకు, వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన జరగాలన్న ప్రభుత్వ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆయన కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర ప్రదేశ్ విజిలెన్సు అండ్ మానిటరింగ్ ఇన్వెస్టిగేషన్ రైట్స్ చైర్మన్, హై కోర్టు సీనియర్ న్యాయవాది డి. తారక ప్రసాద్ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం తమ సంస్థ కేంద్ర ప్రభుత్వ పోలీస్ విభాగాలతో పనిచేస్తోందన్నారు. హక్కుల పరిరక్షణలో భాగంగా, పౌరులకు న్యాయస్థానాల్లో తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. "జాతీయ మానవ హక్కులు నేర నిరోధక కౌన్సిల్" రాష్ట్ర శాఖ అధ్యక్షులు ఆర్‌జే రాజు మాట్లాడుతూ, ఓటు హక్కు సద్వినియోగించుకునేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్త సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఆర్.మీడియా అకాడమీ సెక్రటరి మామిడిపల్లి బాలగంగాధర తిలక్, డా. బి.సాంసన్, డా. దినేష్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

బెజవాడ హాస్పిటల్స్ & డయాగ్నోస్టిక్స్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: విజయవాడ నగరంలో గత 36 సంవత్సరాలుగా చలసాని డాక్టర్ రాజేంద్రప్రసాద్ డాక్టర్. చలసాని పరిమళ ఆధ్వర్యంలో ప్రసిద్ధిగాంచిన బెజవాడ డయాగ్నోస్టిక్స్ ఇప్పుడు విజయవాడ, గవర్నరు పేట కోదండరామిరెడ్డి స్ట్రీట్లో మరిన్ని సౌకర్యాలతో నూతన భవనంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ చలసాని రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గత 4 దశాబ్దాలుగా బెజవాడ డయాగ్నోస్టిక్స్ నమ్మకంతో కూడిన బ్లడ్ రిపోర్టులను సమయానికి అందజేస్తూ విజయవాడ నగర ప్రజల మన్ననలను మరియు విశ్వాసాన్ని పొందిందని తెలుపుతూ, ఇప్పుడు మరిన్ని వైద్య సేవలనందించాలనే ఉద్దేశ్యంతో బెజవాడ హాస్పిటల్స్ అండ్ డయాగ్నోస్టిక్స్ ను నూతన భవనంలో ప్రారంభించడం జరిగిందన్నారు., ఈ నూతన హాస్పిటల్ నందు ట్రామా మరియు లింబ్ రీ-కన్స్ట్రక్షన్లోను, ఆర్థ్రోస్కోపీ అండ్ స్పోర్ట్స్ మెడిసిన్లలో ఫెలోషిప్ చేసిన ప్రముఖ ఆర్థోపెడీషియన్ డాక్టర్ . ప్రశాంత్ చలసాని ఆధ్వర్యంలో ఆర్థ్రోస్కోపీ నందు భుజాలు, మోకాలు కీ హెూల్ శస్త్రచికిత్సలు, లిగ్మెంట్ గాయాలు, స్పోర్ట్స్ గాయాలకు, సంక్లిష్టమైన ఫ్రాక్చర్ శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. న్యూరాలజి, డయాబెటాలజి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, ఇఎన్ టి వైద్యంలో అనుభవజ్ఞులైన డాక్టర్లచే సేవలు అందిస్తామని, ఈ హాస్పిటల్లో 24/7 గంటల పాటు ఎక్స్-రే, ఫార్మసీ, అంబులెన్స్, డయాగ్నోస్టిక్స్ సౌకర్యాలు అందుబాటులో వుంటాయని కూడా తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రముఖ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రూప కొల్లి, మైక్రో బయాలజిస్ట్ డాక్టర్ చలసాని పరిమళ, రేడియాలజిస్ట్ డాక్టర్ కావ్య మిక్కినేని, హాస్పిటల్ సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ముముక్షుజన మహా పీఠాధిపతులకు మండలి నివాళులు



విశాలాంధ్ర-కూచిపూడి : ముముక్షుజన మహాపీఠాధీశ్వరులుశ్రీశ్రీశ్రీ ముత్తీవిసీతారామ్ గురుదేవుల నిర్యాణంధార్మికలోకానికితీరని లోటని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం పెదముత్తేవి లోని సుప్రసిద్ధ శ్రీకృష్ణాశ్రమంలో ఇష్ట దైవాలకు నిత్య పూజ చేస్తూ తీవ్ర అస్వస్థతకు లోనైన ఆయన గత నెల 28న శ్రీగురుపాదాలలో ఐక్యమైన సంగతి పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా సీతారాం గురుదేవుల కార్యక్రమంలో పాల్గొని వారికినివాళు లర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరమపూజ్య సీతారామ యతీంద్రుల ఆధ్యాత్మిక దివ్య వారసత్వం పితృపాదులు లక్ష్మణ యతీంద్రులు 1992 డిసెంబర్ లో ఐహిక జీవనాన్ని చాలించిన తరువాత సీతారామ్ గురుదేవులకు సంక్రమించిందని,. ఆయన సంసారంలో ఉండీ సంసారం అంటని మానసిక సన్యాసని అన్నారు. అసంఖ్యాక శిష్యుల యోగక్షేమాల కోసం అహర్నిశలూ పరిశ్రమిస్తూ ప్రతి ఒక్కరికీ పరమాప్తుడిగా , కుటుంబపెద్దగా సహానుభూతి చెందుతూనే సర్వ సంగ పరిత్యాగని, ఈ కాలపు యతీశ్వరులు , పీఠాధిపతులకంటే ఆధ్యాత్మికంగా ఉన్నతుడని . ఎవరి గురించీ పరుష పదం పలుకక , ఎవరి నిందనూ సహించక , అందరూ మహానుభావులేనని చాటిన సత్పురుషుడని ఆయనతో గడిపిన క్షణాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పలుకు ఎంత మృదువో ఆయనలోఉండే ధర్మాగ్రహం అంత ప్రచండమని,వారి ఆశ్రమం ఒక నంద గోకులమని,. కబేళాలకు తరలే అభాగ్య గోవులకు శ్రీకృష్ణాశ్రమమేఅదృష్టరేఖని పేర్కొన్నారు. ఆధ్యాత్మికం కూడా లాభసాటి వ్యాపారంగా అక్కడక్కడ రూపాంతరం చెందుతున్న ఈ రోజుల్లో సీతారామ్ గురుదేవుల వంటి భక్త శిఖామణి, ప్రేమమూర్తి, త్యాగి,విరాగి, ఆపద్బాంధవుడు, తపశ్శక్తిసంపన్నుడు కనపడటమే అపురూపమని ధర్మ రక్షణకు ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. దైనందిన ఖర్చులకు ఎప్పుడూ తడుముకోవలసిన పరిస్థితుల్లోనే రోజూ వందల,వేలమందికి కులమతవర్గ వివక్ష లేకుండా ఆప్యాయంగా కడుపార భోజనం పెడుతూ ఆఖరు అతిథి చేయికడుక్కున్న తరువాత గానీ ఆహారం స్వీకరించని నిస్వార్థ నిరతాన్నదాత సీతారామ్ గురుదేవులు. తమ లక్ష్మీపతి దేవాలయంలో దేవతా మూర్తుల చోరీ జరిగితే అవి తిరిగి లభించేంత వరకూ అన్నం ముట్టేందుకు ఆయన ఇచ్ఛగించలేదని, ఆ సంఘటన అత్యావశ్యకమైన నేటి కీలక తరుణంలో 66 ఏళ్ల వయసులోనే ఈ సద్గురువు పరమపదించటం ధార్మిక లోకానికి, ఆయనను కుటుంబ పెద్దగా , రక్షకుడిగా తలచి కొలిచే శిష్యకోటికి తీరని వెలితని పేర్కొన్నారు ఈ సందర్భంగా. సీతారాం భార్య కమల తల్లిని, కుమారులను, కుటుంబ సభ్యులను,మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్,మొవ్వ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులులింగమనేని రామలింగేశ్వరరావు పరామర్శించారు. అలాగే పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం సమన్వయకర్త వర్ల కుమార్ రాజా కూడా పరామర్శించారు.

రామలింగేశ్వరునికి 'అన్నాభిషేకం'

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం కూచిపూడి గ్రామంలోని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం మాస శివరాత్రి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణసంఘం ఆధ్వర్యంలో ఆ దేవాలయ పాలకమండలి సహకారంతో మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, లక్ష బిల్వార్చన, శ్రీ చక్రార్చన, మహిళలతో లక్ష కుంకుమార్చన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో సహస్ర దీపాలంకరణ చేశారు. ఈ పూజలలో పాల్గొనడానికి కూచిపూడి అగ్రహారీకులతో పాటు పరిసర గ్రామస్తులు, రెండు తెలుగు రాష్ట్రాల్లో స్థిరపడిన కుటుంబాలు నుంచి పలువురు తరలివచ్చారు. విజయవాడ నుంచి తరలి వచ్చిన వేద పండితుల సారధ్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తిలకించారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి-మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో మేయర్, కమిషనర్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంతృప్తికర పరిష్కారాలు అందించాలని, సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై వచ్చిన 15 ఫిర్యాదులను సంబంధిత విభాగం అధికారులకు తెలియజేసి సూచించిన గడువులోపు నాణ్యమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. సమస్యలకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు కేవీ.సత్యవతి, కే.శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్‌రావు, సిటీ ప్లానర్ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి, యూసీడీ పీవో రోహిణి, ఏడీహెచ్ శ్రీనివాస్, ఆర్‌ఎఫ్‌ఓ వెంకటేశ్వరావు, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, రవిచంద్ పాల్గొన్నారు.

స్పందన సమస్యలు సత్వరం పరిష్కరించాలి : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వచ్చిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణ పరిష్కార చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా.పీ.సంపత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జేసీ, సబ్ కలెక్టర్ అతిదిసింగ్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దష్ట గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. ఒకసారి వచ్చిన అర్జీలు తిరిగి ఓపెన్ కాకుండా శాస్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన సమస్యల పరిష్కారంలో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సీనియర్ రెసిడెంట్ పోస్టులకు ఇంటర్వ్యూలు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్థానిక సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ నెల 13వ తేదీన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో సందర్శించాలని సూచించారు. సీనియర్ రెసిడెంట్‌ల నియామకంతో ప్రభుత్వ సాధారణ వైద్య సేవల విస్తరణ జరగనుందని, రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు.

లోకేశ్ ఒక్కో అడుగు జగన్‌కు ఉక్కుపిడుగు

టీడీపీ నేతలు బుద్ధా వెంకన్న, నాగుల్ మీరా

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): యువ గళంలో లోకేష్ వేస్తున్న ఒక్కో అడుగు జగన్ కు ఉక్కు పిడుగులా మారుతుందని పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు బుద్ధ వెంకన్న నాగుల్ మీరాలు అన్నారు. లోకేశ్ యువగళం యాత్ర 3 వేలకిలోమీటర్లు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం విజయవాడలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దావెంకన్న పార్టీ నేతలు.. కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్ మీరా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేశ్ ను పిల్లాడని ఎగతాళి చేశారని అన్నారు. నేడు ఆయన వేస్తున్న ఒక్కో అడుగు పిడుగులా నేరుగా వైసీపీ ప్రభుత్వంపై పడుతోందన్నారు. అవకాశం కోసం పార్టీలు మారినవారు.. టీడీపీ బలోపేతంలో ప్రమేయం లేని వారు, విజయవాడ పశ్చిమ స్థానం ఆశిస్తున్నారన్నారు. ఈ స్థానం బీసీలకు ఇస్తే వెంకన్నకు ఇవ్వాలని, మైనారిటీలకు ఇస్తే నాగుల్ మీరాకు ఇవ్వాలన్నారు. జగన్ కు కుటుంబవిలువలు లేవని, లోకేశ్ కు ఆ విలువలు ఉన్నాయి కాబట్టే తండ్రి జైల్లో ఉన్నప్పుడు తన బాధ్యత నిర్వర్తించడానికి యువగళం యాత్రకు విరామమిచ్చారని గుర్తు చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ప్రాంత పార్టీ ఇన్చార్జ్ బుద్ధా వెంకన్న మాట్లాడుతూ విజయవాడ పశ్చిమ స్థానం ఎవరికి కేటాయించాలో చంద్రబాబుకి బాగా తెలుసన్నారు. ఆయన నిర్ణయమే శిరోధార్యమన్నారు. పనితీరు, నాయకత్వ పటిమను గుర్తించడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

2024లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తా: మాజీ ఎమ్మెల్యే దాస్

విశాలాంధ్ర-పెదపారుపూడి : పామర్రు నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే డివై దాస్ 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయుచున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో దాస్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేరు ప్రఖ్యాతలు కలిగిన ఒక ప్రముఖ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలియజేయడమైనది. తను ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో పామర్రు నియోజకవర్గం ప్రజలందరికీ నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా అనేక సేవలు అందించి అభివృద్ధి చేశాను అని అన్నారు. తను చేసిన సేవలు నియోజకవర్గ ప్రజలు గుర్తించుకున్నారని మరొకసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే కృష్ణా నది నుండి రక్షిత మంచినీటి సదుపాయం ముఖ్యంగా పామర్రు, పెదపారుపూడి మండలాల లోని ప్రతి ఇంటికి అందించి, నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో నడిపించడానికి వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యేగా పోటీ చేయాల్సిన అవసరం వచ్చిందని ఆయన వివరించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : స్వామి వివేకానంద సేవా సమితి సంస్థ ఆద్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభించారు. సోమవారం 5వ వార్డులో గల సైబర్ జోన్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ లో ఉచిత కంప్యూటర్ శిక్షణ శిబిరాన్ని దివి మార్కెట్ యార్డ్ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గురుముచ్చు ఉమా లు ప్రారంభించారు. స్వామి వివేకానంద సేవా సమితి సంస్థ ప్రతినిధి అనీల్ మాట్లాడుతూ 45 రోజుల పాటు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చి, ప్రతిభ గల వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. నేడు కంప్యూటర్ ఎంతో ఉపయోగం ఉందని, ప్రతి ఒక్కరూ ఉచిత కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, సైబర్ జోన్ సంస్థ ప్రతినిధి బండ్రెడ్డి కృష్ణ లీలా, వివేకానంద స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా శాంతియుతంగా ఉండాలి : డీఎస్పీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రజలంతా శాంతియుతంగా ప్రేమ కలిగి ఉండాలని అవనిగడ్డ డిఎస్పీ మురళధర్ అన్నారు. సోమవారం మండలిపురంలోని సర్వకృపా ప్రార్ధనా మందిరంలో సాలెం పాస్టర్ పెలోషిప్ అధ్యక్షులు విలియమ్ కేరీ ఆద్వర్యంలో సెమి క్రిస్మస్ సర్వ కృపా ప్రార్ధనా మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిఎస్పీ మురళీధర్ పాల్గొని క్రీస్తు చూపిన మార్గానే ప్రతి ఒక్కరూ ఎంచుకోవాలని, శాంతియుతంగా సాటి వారితో ప్రేమగా మెలగాలని డిఎస్పీ అన్నారు. వాక్యోపదేశకులు మోజేష్ పాల్, మనోహర్ పాల్ లు వాక్యం అందించగా క్రిస్మస్ వేడుకలకు వచ్చిన నాగాయలంక మండల పెలోషిప్ అధ్యక్షులు కిరణ్ బాబు, జీవనప్రసాద్,యేసోబు, ప్రభాకర్, ఏసుబాబు లతో పాటు పలువురు విశ్వాసులు పాల్గొనగా,50 మంది పాస్టర్లకు నూతన వస్త్రాలను అందచేశారు.

అనాథ బాలలకు అల్పాహారం పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండా జయలక్ష్మి ఆధ్వర్యంలో అనాథ బాలలకు అల్పాహారం పంపిణీ చేశారు. సోమవారం ఉదయం మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయవాడ సాంబమూర్తి రోడ్డులోని ఎస్కెసీవీ చిల్డ్రన్స్ ట్రస్ట్ లోని అనాథ బాలలకు ఉదయం అల్పాహారం పంపిణీ చేశారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆయేషా, రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పిన్నమనేని బాబ్జీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుడివాడ : ది గుడివాడ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం స్థానిక భాస్కర్ థియేటర్ ఆవరణలో అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య(బాబ్జీ) జన్మదిన వేడుకలను బాబ్జి యువసేన నాయకుడు పైడిముక్కల వంశీ అధ్వర్యలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను బాబ్జీ కట్ చేశారు. అనతరం అభిమానలు అయనను పూలమాలతో ముంచెత్తారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు సుంకర రమణ, గద్దం ప్రకాష్‌దాస్, కెడిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాయకులకు దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : క్రిస్మస్ కాలం పవిత్రమైందని ఈకాలంలో గాయక బృదానికి మెండా కిరణ్‌కుమార్ వితరణతో దుస్తులు పంపిణీ చేయాడం అభినందనీయమని అవిలాపూరి చిన్న తేరేజమ్మ దేవాలయం (ఆర్‌సిఎం) విచారణ గురువు ఎం.లూయిస్‌రాజు అన్నారు. సోమవారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని ఆర్‌సిఎం గుడివాడ-2 చర్చిలో మాలమహానాడు రాష్ట్ర నాయకులు మెండా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కొయిర్ బృదానికి, వృద్ధులకు చీరలు, దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వైసీపి నాయకులు మెండా చంద్రపాల్, ఎం.జె.విక్టర్‌లతో కలసి ఫాదర్ లూయిస్‌రాజు మాట్లాడుతూ గత 11 సం॥లుగా కిరణ్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని గుడ్‌మెన్‌పేట విచారణ పరిధిలోని సుమారు వంద మంది వృద్ధులకు దుస్తులు పంపణీ చేయటం దేవుని దృష్టిలో గొప్ప కార్యమన్నారు. ఈకార్యక్రమంలో ఉపదేశులు మేకతోటి మరియదాసు, డి.దానియేలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న 'చెప్పాడంటే.. చేస్తాడంతే' : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కంచికచర్ల : నందిగామ పట్టణంలోని 18 వ వార్డు డి.వి.ఆర్.కాలనీలో "గడపగడపకు -మన ప్రభుత్వం" కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల బుక్ లెట్ లను శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జగనన్న చెప్పాడంటే. .చేస్తాడంతే నమ్మకం ప్రజల్లో గట్టిగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికి మంచి జరగాలనే దృఢ నిబద్ధతతో చేస్తున్న పరిపాలన విధానం ఆయన విశ్వసనీయతకు నిదర్శన మన్నారు. జగనన్న దార్శనిక నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల మద్దతుగా జగనన్న నిలిచారన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి, పాలనా వికేంద్రీకరణ, పటిష్టమైన సామాజిక భద్రత, సమర్ధ వంతమైన సేవా బట్వాడా, నిష్పక్షపాత సంక్షేమ చర్యలు, మహిళా సాధికారత మరియు బి. సిలు, ఎస్. సి లు, ఎస్టీలు మరియు మైనారిటీల చేరికను పెంపొందించడం వంటి పలు కీలక ప్రమాణాలపై జగనన్న పాలనకు గీటురాయిగా నిలిచాయన్నారు. జగనన్న నాలుగున్నర సంవత్సరాల పాలనలో ఉత్తమంగా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ జగనన్న సంక్షేమ పాలనకు అండగా ఉండి ఆశీర్వదించాల ని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రజల్ని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్చార్జిలు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి, ఆలుగడ్డకు తేడా తెలియని సీఎం : సౌమ్య

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం చెవిటికల్లు,గని ఆత్కూరు గ్రామంలో సోమవారం నాడు మిచాంగ్ తుఫాను వలన పూర్తిగా పాడైపోయిన వరి, మిర్చి పంట పొలాలను జనసేన తెదేపా రైతు నేతలు, శాసనసభ్యులు శ్రీ గద్దె రామ్మోహన్ రావు, ఎన్టీఆర్ జిల్లా తెదేపా రైతు అధ్యక్షులు చెరుకూరు రాజేశ్వరరావు, నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త శ్రీమతి తంబళ్లపల్లి రమాదేవి తో కలిసి మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్య సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉల్లిగడ్డకు ఆలుగడ్డకు తేడా తెలియని ముఖ్యమంత్రి ఉండటం మన రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ఫలితాలతో జగన్ రెడ్డి దిమ్మెరపోయాడు. ఇంకా రాష్ట్ర రైతాంగాన్ని ఏమీ ఆదుకుంటాడు. జగన్ రెడ్డి వై నాట్ లిక్కర్ వై నాట్ సాండ్ వై నాట్ మైన్ అంటూ దోచుకుని దాచుకుంటున్నాడు.స్థానిక ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ బజ్జీల బండ్లు,అరటికాయ బండ్ల వద్ద కమిషన్ల కలెక్షన్లో బిజీగా ఉన్నారు.కమీషన్లు తీసుకోవడానికి వెచ్చించే సమయంలో కొంత సమయమైనా రైతన్నల కోసం కేటాయించడానికి స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్సీకి సమయం లేదు.వేలాది ఎకరాలలో రైతు పంట నష్టపోయాడు. గని ఆత్కూరు గ్రామంలో వందలాది ఎకరాలు నేలవాలయి.కంచికచర్ల మండలంలో 2,160 ఎకరాలు వరి పూర్తిగా చేతికి రాని పరిస్థితి.7500 ఎకరాల్లో పత్తి పూర్తిగా దెబ్బతిన్నది. మిర్చి పొలాలకు పెట్టిన పెట్టుబడులు మొత్తం నేలపాలు అయిపోయాయి.5 ఎకరాలు కౌలు తీసుకున్న రైతు 8 లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి మిర్చి సాగు చేస్తే రూపాయి వచ్చే పరిస్థితి లేదు.రైతుకు ముగ్గురు ఆడబిడ్డలు ఉన్నారు రైతు విలవిలాడిపోతున్నాడు. మిచాంగ్ తుఫాను రైతన్న జీవితాలలో చీకటిని నింపింది. రైతన్న కంట కన్నీరే మిగిలింది.ఒక్క వరి గింజ అయినా రైతన్న చేతికి వస్తుందన్న నమ్మకం లేదు. పాలకులు,అధికారులు పొలాల్లోకి రావాలి తక్షణమే పంట నష్ట పరిహారాలను అంచనాలను వేసి ప్రభుత్వానికి అందజేసి రోజులలోనే రైతుకు పంట నష్టపరిహారాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మేము డిమాండ్ చేస్తున్నాం.

యడ్లపల్లి రామ్‌సుధీర్ వైసీపీలో చేరికకు రంగం సిద్ధం

విశాలాంధ్ర-పెడన : ఇప్పటివరకు జనసేన పార్టీలో కొనసాగిన యడ్లపల్లి రామ్ సుధీర్ మంగళవారం నాడు ఆ పార్టీకి రాజీనామా చేయనున్నారు. బుధవారం నాడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నాడు మంత్రి జోగి రమేష్ ను ఆయన కలిశారు. మంగళవారం సాయంత్రం పెడనలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి జనసేనకు ఆయన రాజీనామా చేయనున్నారు. గత కొంతకాలంగా రామ్ సుధీర్ నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేశారు. వ్యయ ప్రయాసలతో పార్టీని ముందుండి నడిపించారు. నియోజకవర్గ బాధ్యునిగా ఉరివి గ్రామానికి చెందిన సర్పంచి పంచకర్ల సురేష్ ను అధిష్టానం నియమించడంతో రామ్ సుధీర్ హతాశులయ్యారు. ఊహించని పరిణామంతో ఆయన కంగుతిన్నారు. నాలుగు మండలాల్లోనూ అనుచర వర్గం కలిగిన యడ్లపల్లి వారితో సంప్రదింపులు జరిపిన అనంతరం జన సేనతో తెగ తెంపులు చేసుకోవాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే మంత్రి జోగి రమేష్ ను రెండు పర్యాయాలు కలిశారు. ఆ మేరకు వారిద్దరి మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో వైసిపి కండువా కప్పుకోవడానికి నిర్ణయించారు.

సమాజానికి సేవ చేస్తూ అభివృద్ధికి తోడ్పడాలి : అడపా

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : సమాజానికి మన వంతుగా సేవ చేస్తూ అభివృద్ధికి తోడ్పడాలని ఏపీ కాపు కార్పోరేషన్ చైర్మన్ అడపా శేషు అన్నారు. హనుమాన్ జంక్షన్ లోని దుట్టా కృష్ణమూర్తి బృందావన్ గార్డెన్స్‌లో అడపా వారి కార్తీక వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి అడపా వారి కుటుంబ సభ్యులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కుటుంబంలోని సభ్యులందరూ ఐకమత్యంగా ఉంటూ విద్యా ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దీనికి తమ కార్పోరేషన్ నుండి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం కార్యక్రమ నిర్వహణకులు శేరి నరసన్నపాలెం సర్పంచ్ అడపా అంజిబాబు ఆయన సోదరులను ఘనంగా సత్కరించారు. గన్నవరం నియోజకవర్గ జనసేన సమన్యాయకర్త చలమలశెట్టి రమేష్ , అడపా యుగంధర రావు, అడపా దేవులు బాబు , అడపా వంశీ, అడపా సతీష్ , ప్రకాశం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి అడపా ఉదయ భాస్కర్, అమలాపురం అడపా శివయ్య , సర్కిల్ ఇన్స్పెక్టర్ అడపా సతీష్ , గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు అడపా మాణిక్యాలరావు పలువురు అధికారులు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అమలాపురం , తుని తదితర ప్రాంతాలనుండి అడపా వంశీకులు బస్ లలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో అతిథులు అడపా శేషు బాబును, డాక్టర్ దుట్టా రామచంద్రరావు ను సన్మానించారు. పసందైన విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అతిథులకు సన్మానం చేశారు.

బాబాయ్ హోటల్‌లో సందడి చేసిన హీరో వెంకటేష్

విశాలాంధ్ర-విజయవాడ : స్థానిక బాబాయ్ హెూటల్‌లో సినీ హీరో వెంకటేష్ సందడి చేశారు. సైంధవ్ మూవీ ప్రమోషన్‌కి సోమవారం విజయవాడ వచ్చిన సినిమా యూనిట్ దుర్గమ్మ దర్శనం అనంతరం టిఫిన్ చేసేందుకు బాబాయ్ హెూటల్‌కు రావటం జరిగింది. వెంకటేష్ అభిమానులు, స్థానికులు ఆయనతో సెల్ఫీలు దిగి ముచ్చటించారు.